# అభాగ్య కుమారి : అన్నిటికీ సంసిద్ధ

యం. హీరాలాల్ రాయ్

మొహం అద్దంలో చూసుకుంది. గుండె ఆగినట్టనిపించింది. ఇన్నాళ్ళనుంచీ తన్ను తాను దగా చేసుకున్నట్టు అనిపించింది.

రాణి ముసలిదైపోయింది. దాని మొహంలోని అందంఅంతా చప్పబడిపోయింది. కళ్లల్లో కాంతి మలిగిపోయింది. మెరుపులాంటి దాని శరీరం వంగిపోయిన బెత్తంలా అయిపోయింది. ఆనాటి తన సౌందర్యాన్ని గూర్చిన గర్వం ఇవాళ ప్రాణాలు పని లేస్తోంది. తన వొంటిమీది ముడతల్లో విషం దాక్కున్నట్టు భయపడ్డది. తాను జగత్తులో అన్నిటికంటె అనాకారి వస్తువని గ్రహించింది.

ఆ కాలంలో—అది యువకుల ఆకాంక్షలతో ఆడుకునేది. మంచి యువకుణ్ణి లొంగతీయగలిగినప్పుడు తన మనస్సు గర్వంగా నవ్వేది. ఆ నవ్వులో ఎంత బింకం! ఎంత నీటుదనం! ఆనాడు జగత్తు దానికళ్లల్లో తృణప్రాయం. ఆనాటి దాని ఒక చిన్న నవ్వు యువకుల కాళ్లను అలా వణికించేసేది. దాని ఓరచూపు పెద్దపెద్ద యోధుల్ని ఓడించేది. దాని నిడుపైన శిరోజాలు, దాని సన్ననినడుం, యువ హృదయాలమీద గారడీ చేసేవి. వెండి నాణాలకోసం అది ఎందరిని పాడుచేసింది! కుర్రాళ్ళని కవ్వించి, వాళ్లను ఆశలు రేపి, వాళ్ళను పిండుకొని ఆనాడు ఎంత తృప్తిపడేది.

ఆ రోజులు జ్ఞాపకంవస్తే గుండె వణికి పోతుంది.

ఆనాటి నవ్విన మనస్సే నేడు ఏడుస్తున్నది. తాను గతంలో చేసిందంతా పాపమేనా అని ప్రశ్నించుకుంటున్నది. మొత్తంమీద గతాన్ని ఏవగించుకోడం ప్రారంభమైంది. మళ్లీ ఆలోచిస్తుంది—తాను ఈ పాడుజగత్తు తనకు చేసిన ద్రోహానికి మంచి ప్రతీకారం చేసిందికదా! ఇక విచారం దేనికి? తాను ఈ వృత్తికి పాల్పడేట్టు వత్తిడి తెచ్చిన సమాజాన్ని విషకలుషితం చేసిందిగా!

పాపం! చక్కని కుర్రాడు స్వరూప్. ఎంత అమాయకుడు! అమృతహృదయుడు! వాణ్ణి గూర్చిన ఆలోచన తనను చాలా బాధిస్తుంది. తన ప్రాణం వాడికోసం ఆరాట పడుతుంది. స్వరూప్ మంచి చదువుకున్నవాడు. మధ్య తరగతి కుటుంబానికి చెందినవాడు. బోలెడు డబ్బు సంపాదించాడు, లక్షలు ఖర్చుచేసేడు. వాడు ఒకనాడు అనుకోకుండా రాణి దివాణంలోకి వెళ్లాడు. దాని చేతులో బొంగరం అయిపోయాడు. గిరగిరా తిరిగాడు. చాలా వేగంగా తిరిగాడు. వాడు మళ్లీ కదల్లేక బొమ్మయిపోయాడు. దానిలో పడివున్నాడు.

రాణి వాడితో ఆడుకుంది. వాణ్ణి వాడుకుంది. వాడిజేబు ఖాళీ అయిపోయింది. దీని గుండెలో వాడిపైన గల కాంక్ష ఖాళీ అయిపోయింది. స్వరూప్‌ను తన్నేసింది. చచ్చాడు. తన్ను తినడం, భరించడం వాడి చాతకాలేదు. అందుకే ఈలోకాన్ని ఖాళీచేసి వెళ్ళిపోయాడు.

ఆ గాథ జ్ఞాపకం వచ్చి ఏడుస్తుంది. పిచ్చిదానిలా 'స్వరూప్'ను పిలుస్తుంది. స్వరూప్ లేడుగా! దానికి తెలుసు తాను వాణ్ణి చంపిందని. తాను పాపి. హంతకురాలు. అయితే మరి తన తప్పేముంది. తనను అలా సిద్ధంచేసిన పాడు సమాజంలో ఒకభాగం స్వరూప్. వాణ్ణిచంపడం సమాజంమీద చేసిన ప్రతీకారచర్యలో ఒక భాగం. ఈ సమాజం తన గుండెను బండ కట్టించింది. మరీ పాడుచేసింది. చించి చెండాడింది. అన్నివిధాలా చిక్కుల పాలుచేసింది.

* * *

ధనికుల లోకంలో పేదవాడు బతకటం పాపం. ధనంపోసి తన యౌవనాన్ని దోచేశారు. జీవితానికి మచ్చ కలిగించారు. అందుకే వాళ్లతో ప్రతీకారం తలపెట్టాను. ఏంలోకం! నా పేదతనాన్ని చూచి నాకు సహాయం చేసే వాళ్లు. ఆ సహాయానికి ప్రతిఫలంగా నా యౌవనాన్ని వాడుకునేవారు.

గొప్పగొప్ప నాగరికులైన సన్మార్గులైన ఈ దొంగలు నన్ను దోచేశారు. ఆపాపమే నాలో విప్లవం లేవదీసింది. జమీందార్లు, ప్రొఫెసర్లు,

నాయకులు, సాధువులు అంతా నా శరీరాన్ని నలుచుకున్నారు. నేటికీ లోకం వాళ్ళనే గౌరవిస్తుంది. జగత్తు నాకు చేసిన అన్యాయాన్ని ఎలా మరిచిపోను! స్వరూప్‌ను చంపడానికి నాదే బాధ్యత. కాని, లోకం నన్ను విషనాగుగా ఎందుకు చేసింది? పులి తనమీద దాడి చేయునప్పుడే లేడి పరిగెత్తటం నేర్చుకుంటుంది. నేను ప్రతీకారం చేయడానికి పూనుకున్నది. నన్ను బాధించినాకనే గదా!

ఈ నాటి సమాజం నావంటి అభాగ్యుల గొంతు కోయటానికి నూరిపెట్టుకున్న కత్తిని దొంగచాటుగా లాక్కొని, ఈ సమాజం డొక్కలో పొడిస్తే తప్పేముంది? ఈ సమాజ రాక్షసి విష దంష్ట్రలు పీకి దాని శరీరంలో అంగుళం అంగుళాన గుచ్చి తిప్పితే తప్పేం? ఏం మానవత్వం? దుర్బలుడూ, బలవంతుడూ ఈ రెండు వర్గాలేనా ఈ లోకంలో సంఘర్షణ పడవలసింది? బలవంతుడు శాసనం చేస్తాడు. దుర్బలుడు శిక్ష అనుభవిస్తాడు. బలవంతుడు బంగారు మేడలు కడతాడు. దుర్బలుడు గోరీ కట్టించుకోలేక నక్కలపాలు అవుతాడు. నాకు అలా చావడం ఇష్టంలేక ఇతరుల్ని అలా చేరి చంపాను. వాళ్ళగోరీల్ని వాళ్ళతో తవ్వించాను. ప్రకృతి నాకిచ్చిన సౌందర్యంతో ప్రతీకారం చేశాను.

ఆడది బానిస అనుకుంటాడు మొగాడు. ఆడది పుట్టగానే దాని మొహాన బానిసబొట్టు పొడుస్తాడు. అంత మాత్రాన స్త్రీ లొంగుతుందను కోవడం పొరపాటు. వాళ్ళ ఘోరాలను చూస్తే నాకు నేటికీ కోపం వస్తుంది. తరతరాల నుంచీ మగాళ్లు చేసిన ఘోరాలకు సరిసమానమైన ప్రతీకారం జరపాలి. నేనూ ఈ ఆశయం కోసం చనిపోయానా, నా వృత్తిలో, ఇంకా పెంపొందుతున్న నా సోదరీమణులు నా కార్యక్రమాన్ని నిర్వర్తిస్తూనే వుంటారు.

నేను లోకాన్ని అడుగుతాను. లోకం మనిషిని తత్త్వవేత్త చేస్తుంది! డాక్టర్ను చేస్తుంది; మహర్షిణి చేస్తుంది; దేవత చేస్తుంది, కాని, మనిషిని మనిషి చేయజాలదు. ఆశ్చర్యం! కొంత చరిత్ర, కొంత సైన్సు, కొంత భూగోళం గొడవ తెలిసినంత మాత్రాన మనిషి మనిషి అవుతాడా? అలా కాలేదు. ఈ ఖూజెక్కిన సమాజం మారిపోయేదాకా మానవుడు మానవుడు కాలేడు.

నేను చేసిన పాపాలన్నీ మొదట చాలా ఆనందాన్ని ఇచ్చినై. పాపం నన్ను కూడా బాధించింది. జగత్తు తన అనుభవాన్ని ఆలోచించుకొని సమాజాన్ని మార్చినా బావుండును! ఈ ధనతృష్ణగల దొంగలు నిజమైన పాపులు. పాపం చేసే మనిషి తన్ను తెలుసుకోడు. పాపం పెరుగుతుంది. మరీ పెరుగుతుంది. ఆలోచన లేదు. ముందు దృష్టిలేదు. డబ్బుతో మానవుడు తన కళ్ళమీద గంత కట్టుకున్నాడు. గర్వంతో గుడ్డివాడయిపోయినాడు. మానవుడికి నేడు స్వార్థం కిరీటంలా వుంది. ఈ కిరీటం కంటే విలువైన మానవత్వాన్ని వారు గుర్తించరు.

ధనికులు తమ డబ్బును పేదల గుండెరక్తం కాచి వడపోసి కూడగట్టారు. ఇదే వాళ్ళ పెట్టుబడి. పేదల శవాలమీద కట్టిన మేడ వీళ్ళకు మంగళం ఇస్తుందా? నిరాశ్రయుల మూల్గుల రసంతో వీళ్లు బలవగలరా? వీల్లేదు. యెన్నటికీ అలా జరగదు. పేదల అజ్ఞానం వీళ్ళనిలా పెరగనిచ్చింది. అవాళ మేం కళ్లు తెరుస్తున్నాం. మేం చేసే పాపం విధిలేక. అంతే మనస్ఫూర్తిగా కాదు. ధనిక రాక్షసులు ఇలా మమ్మల్ని బలవంతం చేసి పాపానికి పురికొల్పుతారు.

*       *       *

రాణికి జగత్తు మీద కోపం ఇందుకే. ఈ అసమానత్వం, ఎగుడు దిగుడులు పనికి రావంటుంది రాణి. సమ సమాజం దాని ఆదర్శం. దానికి పిడికెడు తిండిని ఇవ్వజాలని లోకం మీద ప్రతీకారానికి పూనుకుని యువకుల ప్రాణాల్తో ఆడుకుంది. కాని, ఎందుకో స్వరూప్ గూర్చి విచారం మాత్రం దాని గుండెలోతుల్లోకి దిగి, ఎంతకూ మరపురాదు. ఎందుకో!